దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

మూసాపేట: మూసాపేట పరిసర ప్రాంతాల్లో దోమలు విపరీతంగా పెరుగుతున్నాయని చెరువుల్లో గుర్రపు డెక్కను తొలగించకపోవటమే ప్రధాన కారణమని బీజేపీ నాయకులు సర్కిల్ ఉప కమిషనర్ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ క్రమంలో బీజేపీ నాయకులు భారీ ఎత్తున మున్సిపల్ కార్యాలయానికి వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. గేటు ఎదుట ధర్నా నిర్వహించటంతో ఉపకమిషనర్ రమేష్ బయటకు వచ్చి వినతిపత్రాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మహేందర్ మాట్లాడుతూ... మూసాపేట పరిసర ప్రాంతాల్లో చెరువులు ఎక్కువగా ఉన్నాయని వాటిని శుభ్రంగా ఉంచాలన్నారు. గుర్రపు డెక్కను ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయని తెలిపారు. కూలీపని చేసుకొని అలసిన శ్రామికులు రాత్రిళ్లు నిద్రపట్టక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఫాగింగ్ మెషిన్లను పెంచి చెరువులు, కుంటలు, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో యాంటీ లార్వా స్ప్రే చేయించాలని కోరారు. ఎంటమాలజీ డిపార్టుమెంట్‌లో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ సీనియర్ నాయకులు శ్రీకర్ రావు, డివిజన్ అధ్యక్షులు పిట్ల మనోహర్, నాయకులు తూము శైలేష్, ఈ. సాయి తదితరులు పాల్గొన్నారు.

యూజీడీతో వరదనీటి సమస్యకు చెక్

అల్విన్‌కాలనీ: అల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఇండియన్ బ్యాంక్ నుంచి ఎల్లమ్మ చెరువు సర్‌ప్లస్ నాలా వద్ద రూ.2కోట్లతో భూగర్భ పైపులైన్ పనులను చేపట్టారు. శుక్రవారం ఈ పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించి మాట్లాడారు. ఉషాముళ్లపూడి ప్రధాన రహదారిలోని శుభోదయకాలనీ పరిసర ప్రాంతాల్లో రోడ్డుపై నిలుస్తున్న వరదనీటి సమస్యకు చెక్ పడనుందన్నారు. నేరుగా ఎల్లమ్మ చెరువు సర్‌ప్లస్ నాలాలో వరదనీరు కలిసేటట్లుగా నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, షౌకత్ అలీ మున్నా, పోశెట్టి గౌడ్, నజీర్, మోజస్, వర్కు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో మరిన్ని వసతులు కల్పిస్తాం

నాగుల సత్యం గంగపుత్ర

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ వి. రామారావునగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆర్‌ఓఆర్ ప్లాంట్‌ను గతంలో లయన్స్ క్లబ్ బంజరాహిల్స్ శాఖ విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే సంకల్పంతో ఏర్పాటు చేశారు. ఈ సంవత్సరం అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో భాగంగా పాఠశాలలో మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్న తరుణంలో ఆర్‌ఓఆర్ వాటర్ మెషిన్ రిపేరింగ్‌కు వచ్చింది. దానిని శుక్రవారం కంపెనీ సిబ్బంది మెషిన్‌ను రిపేర్ చేసి విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండే విధంగా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ బంజారాహిల్స్ శాఖ సీనియర్ సభ్యుడు నాగుల సత్యం గంగపుత్ర మాట్లాడుతూ... అల్లాపూర్ డివిజన్‌లోని పర్వత్‌నగర్ వీ. రామారావు నగర్, మూసాపేట డివిజన్‌లోని మూసాపేట పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ బంజారా హిల్స్ శాఖ ఆధ్వర్యంలో ఆర్‌ఓఆర్ వాటర్ మిషన్ ఏర్పాటు చేశామని తెలిపారు. త్వరలో బంజారాహిల్స్ శాఖకు నూతన కమిటీని ఎన్నుకున్న తరువాత మరెన్నో ప్రభుత్వ పాఠశాలలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి కృషి చేస్తామని తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

మోతీనగర్: అకాల వర్షాలు పడినప్పుడు వర్షంలో తడిచినా, తిరిగినా జ్వరాలు వచ్చే ప్రమాదం ఉందని అటువంటి సమయంలో వైద్యులను సంప్రదించి వారి సూచన మేరకు మందులను వాడాలని నీలిమ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి. శ్రీనివాస్ పేర్కొన్నారు. వర్షాకాలంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాల్లో భాగంగా శుక్రవారం పీవర్ క్యాంపును ఇందిరానగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి జ్వర పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ తరచూ వైద్యులను సంప్రదించి సాధారణ వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అంతేకాకుండా వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలన్నారు. నీలిమా ఆసుపత్రి ఆధ్వర్యంలో ప్రతి బస్తీకాలనీల్లో తరచూ ఉచిత మెగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా ఉచిత మెగా వైద్య శిబిరాలు మరెన్నో నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు నవీన్, చంద్రారెడ్డి, అనుపమ, శ్రీతేజ తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన ఫ్లైఓవర్ పనులు

చందానగర్ జాతీయ రహదారిపై వాహనాల ట్రా'ఫికర్'

పూర్తి కాని సర్వీస్ రోడ్డు

రోడ్డు పక్కన వాహనాల పార్కింగ్

హఫీజ్‌పేట్: చందానగర్ జాతీయ రహదారిపై నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనులు నత్తనడకన నడుస్తున్నాయి. దీంతో నిత్యం ట్రాఫిక్ జామ్‌లతో వాహనదారుల ఇబ్బందులు వర్ణనాతీతం. ఫ్లైఓవర్ నిర్మించేటపుడు రెండు సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ ఒకవైపు సర్వీస్ రోడ్డు పూర్తి చేశారు. మరోపక్క అసంపూర్తిగా ఉంది. దీనికితోడు ఫ్లైఓవర్ ర్యాంపు కోసం తవ్వి వదిలేసిన రోడ్డు లోతుగా గుంత ఉంది. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ఈ గుంతలో వరద నీరు చేరితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. రోడ్డు కోసం తవ్విన గుంత పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఫ్లైఓవర్ నిర్మాణ పనుల్లో ఆలస్యంతో చందానగర్ ప్రధాన రోడ్డుపై ఉన్న వ్యాపార సముదాయాలకు వచ్చే వారు కార్లు, ద్విచక్ర వాహనాలు జాతీయ రహదారి పక్కనే పార్క్ చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ పోలీసులు చలానాలు వేస్తున్నారు.

సమస్యలు ఇవే..

- హైదరాబాద్– ముంబాయి జాతీయ రహదారి కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రాంతంలో వ్యాపార సముదాయాలు ఉండడంతో షాపింగ్‌కు వచ్చేవారు తమ వాహనాలను రోడ్లు పక్కన ఆపుతున్నారు.
- సర్వీస్ రోడ్డు ఒకవైపు పూర్తి చేశారు. మరో వైపు పూర్తికాకపోవడంతో అక్రమ పార్కింగ్ వల్ల సమస్యలు వస్తున్నాయి.
- చందానగర్–లింగంపల్లి నాలా వరకు ఉన్న షాపులకు వచ్చే వారికి పార్కింగ్ సమస్య వస్తోంది.
- ఉదయం, సాయంత్రం వేళ వాహనాల రద్దీ పెరగడంతో ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి.
- సర్వీస్ రోడ్డుపైనే వాహనాలు నిలపడం వలన తరచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.
- జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ పనులు జరుగుతున్నాయనే సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.
- జాతీయ రహదారిపై తాత్కాలిక వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సర్వీస్ రోడ్డు పూర్తి చేయాలి

చందానగర్ జాతీయ రహదారిపై నిర్మిస్తున్న ఫ్లైఓవర్‌కు ఇరువైపులా సర్వీస్ రోడ్డు నిర్మించాలి. కానీ ఒకవైపు నిర్మించి మరోవైపు వదిలేశారు. వెంటనే అసంపూర్తిగా ఉన్న సర్వీస్ రోడ్డు పనులు ప్రారంభించాలి.

–రామకృష్ణ గౌడ్, చందానగర్

చలానాలు వేస్తున్నాం

జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో సర్వీస్ రోడ్డుపై వాహనాలు నిలిపిన వారికి చలానాలను విధిస్తున్నాం. ట్రాఫిక్ జామ్‌లు కాకుండా వాహనాలు రోడ్డుపై పార్కింగ్ చేయొద్దని కోరుతున్నాం. అంతే కాకుండా రాంగ్ రూట్‌లో వస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నాం.

–పవన్ కుమార్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, ఆర్సీపురం



చందానగర్ జాతీయ రహదారిపై నిర్మిస్తున్న ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్డు అసంపూర్తిగా ఉన్న దృశ్యం



ప్రమాదకరంగా ఫ్లైఓవర్ ర్యాంపు గుంత

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసిన ఎంపీ ఈటల

రాష్ట్రంలోని రోడ్ల అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమైన మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

కుత్బుల్లాపూర్: కేంద్ర రోడ్డు, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఢిల్లీలో ఆయనను కలిసిన రాజేందర్ రాష్ట్రంలోని పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా కొంపల్లి ఫ్లై ఓవర్ల అండర్ పాస్, నత్తనడకన సాగుతున్న ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్, శామీర్‌పేట రోడ్డు, ఎల్బీనగర్ అండర్‌పాస్, హుజూరాబాద్ రోడ్డు సమస్యలపై చర్చించారు. హైదరాబాద్‌లో నిర్మించే అన్నీ అండర్ పాస్‌లు కాకుండా ఫ్లై ఓవర్‌లు నిర్మించాలని కోరారు. హుజూరాబాద్‌లో సింగాపూర్, రాంపూర్, రంగాపూర్, పెద్దపాపాయపల్లి ప్రాంతాల్లో రైతులకు ఇబ్బంది లేకుండా సర్వీస్ రోడ్డు నిర్మాణం చేయాలని కోరారు. ఈటల రాజేందర్ లేవనెత్తిన సమస్యలపై స్పందించిన నితిన్ గడ్కరీ మరోసారి సమగ్రంగా సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

క్యాచ్‌పిట్‌లు ఏర్పాటు చేయండి

బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధిలోని ఫిరోజ్‌గూడలో బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి శుక్రవారం వాటర్ వర్క్స్ మేనేజ్ అనిల్‌కుమార్‌తో కలిసి పర్యటించారు. తరుచూ వర్షపునీరు రోడ్లపై నిలుస్తున్న నేపథ్యంలో క్యాచ్‌పిట్స్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సత్తిరెడ్డి కాలనీ అధ్యక్షుడు మల్లారెడ్డి, సభాపతిరెడ్డి, సుధాకర్, సిబ్బంది ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కాలభైరవస్వామికి పూజలు

మోతీనగర్: జ్యేష్టమాస బహుళ అష్టమిని పురస్కరించుకొని అవంతినగర్‌లోని ప్రత్యంగిరా సమేత కాలభైరవస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 29న ఉదయం 9 గంటలకు అభిషేకం, కూష్మాండ దీపార్చన, అష్టోత్తర శతనామావళి, మహాహారతి, ప్రత్యంగిరా దేవి అమ్మవారికి మిరపకాయల మాల సమర్పిస్తారన్నారు. శనివారం అష్టమి వల్ల శని గ్రహదోషం, శత్రుపీడ, వివిధ రకాల దోషాలు, అపమృత్యు దోషాలు తొలగుటకు కూష్మాండ దీపములు సంకల్పయుక్తముగా వెలిగిస్తామని తెలిపారు.

రేపు ఆలయ వార్షికోత్సవం

మోతీనగర్: శ్రీసద్గురు సాయినాథుడి ఆలయ 7వ వార్షికోత్సవం ఈనెల 30వ తేదీ అవంతినగర్ తోటలో నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 గంటలకు గణపతి పూజ, పుణ్యావచనం, రక్షాబంధనం, దీక్ష ధారణ, మండప ఆవాహన పూజ, విగ్రహ మూర్తులకు అభిషేకం, అర్చన తదుపరి దేవతామూర్తుల హోమాలు, పూర్ణాహుతి వంటి పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 6.30గంటలకు దేవతా మూర్తుల ఊరేగింపు, మహిళా మండలి వారి ఆధ్వర్యంలో కోలాటం ఉంటుందని తెలిపారు.

పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



బహుముఖ ప్రజ్ఞాశాలి పీవీ

ఘనంగా పీవీ నరసింహారావు జయంతి వేడుకలు



కేపీహెచ్‌బీకాలనీలో పీవీ నరసింహారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అల్విన్‌కాలనీ: భారతదేశ ఆర్థిక సంస్కరణల పితామహుడు, ప్రధాని పదవి చేపట్టిన తొలి దక్షిణాది వ్యక్తి, తెలంగాణ ముద్దుబిడ్డ పాములపర్తి వేంకట నరసింహారావు అని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులతో కలిసి ఆయన పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. ఆర్థిక సంస్కరణలకు ఊతం ఇచ్చి, భారతదేశాన్ని ప్రగతిపథంలో నడిపించిన తెలంగాణ ముద్దుబిడ్డ పీవీ నరసింహారావు అన్నారు. గొప్ప దార్శనికుడు, ఆయన జీవితం భావితరాలకు ఆదర్శమన్నారు. ప్రధాని పదవి చేపట్టిన ఒకే ఒక్క తెలుగువాడు అని తెలిపారు.

- కుంటుపడుతున్న భారత ఆర్థిక వ్యవస్థను తిరిగి పట్టాలెక్కించిన ఘనతను సొంతం చేసుకున్న వ్యక్తి పీవీ నరసింహారావు అని తెలిపారు. శాసనసభ్యుడిగా రాజకీయ జీవితం ఆరభించిన పీవీ రాష్ట్ర మంత్రి, ముఖ్యమంత్రిగానే కాకుండా కేంద్ర రాజకీయాల్లోకి ప్రవేశించి ప్రధాన మంత్రి పదవిని చేపట్టారని కొనియాడారు. తగిన సంఖ్యా బలం లేని మైనార్టీ ప్రభుత్వాన్ని పూర్తి కాలం పాటు నడిపించటం గొప్ప విషయని అన్నారు. గొప్ప పరిపాలన అధ్యక్షుడు అని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాదాపూర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, నాయకులు శర్మ, కాశీనాథ్‌యాదవ్, పోతుల రాజేందర్, చంద్రమోహన్ సాగర్, రాము, మల్లయ్య, రజనీకాంత్, శివసాగర్, రవి, జగన్, అంజలి తదితరులు పాల్గొన్నారు.

అపర చాణుక్యుడు పీవీ

కేపీహెచ్‌బీకాలనీ: దివంగత భారత ప్రధాని పీవీ నరసింహారావు బహుముఖ ప్రజ్ఞాశాలి అని కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్‌రెడ్డి అన్నారు. పీవీ నరసింహారావు జయంతిని పురస్కరించుకొని శుక్రవారం కేపీహెచ్‌బీకాలనీలో పీవీ నరసింహారావు చిత్రపటానికి ఆయన నివాళులర్పించారు. శేరి సతీష్‌రెడ్డి మాట్లాడుతూ.. భారతదేశ ఆర్థిక వ్యవస్థను ఉద్ధరించి, దేశం ఈనాడు ఇంత గొప్ప ఆర్థిక శక్తిగా వెలుగొందడానికి పునాదులు వేసిన అపర చాణుక్యుడు అని కొనియాడారు. ఒక మైనార్టీ ప్రభుత్వాన్ని ఐదు సంవత్సరాల పాటు విజయవంతంగా నడపడంలో సఫలీకృతుడయ్యారని కొనియాడారు. అనేక సవాళ్లు, అపనిందలు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు.

- పదవిలో ఉండగానే కోర్టు ఖర్చు కోసం ఇళ్లు కూడా అమ్ముకున్న స్థితప్రజ్ఞుడని కొనియాడారు. ఎటువంటి హంగూ, ఆర్భాటం, ఆడంబరం, ప్రచార యావలేని రాజనీతిజ్ఞుడని కొనియాడారు. పీవీ నరసింహారావు లాంటి గొప్ప నాయకుడిని ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, మహిళా అధ్యక్షురాలు రజిత, బోజమ్మ, బి.సంజీవరావు, మేకల మైకేల్, బి.బ్లాక్ అధ్యక్షురాలు రేష్మ, మాజీ వార్డు సభ్యురాలు మనీ అమ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ అరవింద్‌రెడ్డి, ఫణీంద్రకుమార్, బాబ్జీకుమార్, నాగమల్లేశ్వరరావు, రాజు ముదిరాజ్, శేషగిరిరావు, సూరిబాబు, కొమ్ము బాబు తదితరులు పాల్గొన్నారు.



వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

• ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు • భూగర్భ డ్రైనేజీ పైపులైన్ పనుల పరిశీలన



కేపీహెచ్‌బీకాలనీ వార్డు కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మూసాపేట: కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు వద్ద జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను శుక్రవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలాజీనగర్‌లో రోడ్ల మీద వర్షపు నీరు నిల్వకుండా ప్రస్తుతం నిర్మిస్తున్న పైపులైన్ల ద్వారా నేరుగా రంగధాముని చెరువు సర్‌ప్లస్ నాలాలోకి కలిసేటట్లుగా పైపులైన్ నిర్మాణం జరుగుతోందన్నారు. చిన్నచిన్న వర్షాలకు పరిసర ప్రాంతాల్లో అనేక ప్రాంతాల్లో నీరు నిలిచిపోయి రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. అంతేకాకుండా కాకుండా అపార్టుమెంట్ సెల్లార్, ఇళ్లల్లోకి నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడేవారని గుర్తు చేశారు. ఈ పైపులైన్ నిర్మాణంతో వర్షపు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాబూరావు, ఈఈ సత్యనారాయణ, వాటర్‌వర్క్స్ జీఎం ప్రభాకర్, డీఈ ఆనంద్, ఏజీఎం రషీద్, బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షులు ప్రభాకర్‌గౌడ్, జిమ్ గోపాల్, శీలం రమేష్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మంత్రులతో మాట్లాడి నిధులు తీసుకొస్తా

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ కాలనీలో ఉన్నటువంటి పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలని అందుకు కావాల్సిన నిధులను జిల్లా మంత్రులతో మాట్లాడి తీసుకొస్తానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం కేపీహెచ్‌బీ డివిజన్‌లోని పలు కాలనీల్లో స్థానిక కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. శ్రీల అపార్టుమెంట్ నుంచి ముళ్లకత్వ చెరువు వరకు జరుగుతున్న డ్రైనేజీ పనులను, ఏడో ఫేజ్ నుంచి ఫోరమ్ మాల్ వరకు సర్వీస్ రోడ్డు వేయాల్సిన మార్గాన్ని పరిశీలించారు.

- అదే విధంగా డ్రైనేజీ సరిగ్గా లేకపోవటంతో పొంగిపొర్లుతున్న అధికారులు ఎందుకు పనులు చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కేపీహెచ్‌బీ కాలనీ వార్డు కార్యాలయంలో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌లోని పలు కాలనీ అధ్యక్షులు వారి సమస్యలను ఫిర్యాదులను ఎమ్మెల్యే కృష్ణారావుకు అందజేశారు.
- ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ... శ్రీల అపార్టుమెంట్ నుంచి ముళ్లకత్వ చెరువు వరకు జరుగుతున్న డ్రైనేజీ పనుల్లో జాప్యం జరుగుతోందన్నారు. అధికారులు, ప్రజలకు ఇబ్బంది కలగకుండా అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం డివిజన్‌లోని పలు కాలనీల్లో మంచినీటి సమస్యలు రాకుండా వాటర్‌వర్క్స్ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

నేడు అధికారులతో సమీక్ష

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ వార్డు కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఈనెల 29న అన్ని శాఖల అధికారులతో డివిజన్ అభివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సీహెచ్. ప్రభాకర్‌గౌడ్ తెలిపారు. శనివారం ఉదయం 9గంటలకు ఈ సమావేశం ఉంటుందని కార్పొరేటర్ శిరీష బాబూరావు పేర్కొన్నారు. డివిజన్‌లో నెలకొన్న పెండింగ్, అభివృద్ధి పనులపై సమీక్షించనున్నారు. డివిజన్ పరిధిలోని కాలనీ అసోసియేషన్ సభ్యులు, అనుబంధ కమిటీ సభ్యులు హాజరు కావాలని కోరారు.



ఐడీఎల్ చెరువు వద్ద యూజీడీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, అధికారులు



కేపీహెచ్‌బీకాలనీలో మ్యాన్‌హోల్‌ను పరిశీలిస్తూ..